© July 2026 | IJIRT | Volume 13 Issue 2 | ISSN: 2349-6002

# నెల్లూరి కేశవస్వామి 'యుగాంతం' కథలో ప్రతిబింబించిన హైదరాబాదు సంస్థాన విలీనకాలం నాటి సామాజిక పరిస్థితులు

డా. ఎం. వి. పట్వర్ధన్
*అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం*
*ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూరు. జిల్లా: మంచిర్యాల, తెలంగాణ*

**వ్యాస సంగ్రహం—తొలి తరం తెలుగు కథా రచయితలలో ఒకరైన నెల్లూరి కేశవస్వామి *(1920-84)* హైదరాబాదులో పుట్టి, పెరిగి, ప్రజల పక్షం వహించి,హైదరాబాదు నగర జీవనశైలిని, విభిన్న సామాజికకోణాలను ఆవిష్కరించిన కథకులు నెల్లూరు కేశవస్వామి. హైదరాబాదు నగర సంస్కృతి గా పిలువబడే ఫ్యూడల్ సంస్కృతిలో బతికిన నవాబులు, మధ్యతరగతి, పేదల కుటుంబాలను చాలా సన్నిహితంగా పరిశీలించి, ఆయన రాసిన కొన్ని కథలతో, ఆయన మరణానంతరం, 'చార్మినార్' (1981)కథలసంపుటిని ఆయన మిత్రులు వెలువరిం చారు,**

**ఈ చార్మినార్ సంపుటిలోని 'యుగాంతం కథ' భారత దేశంలో హైదరాబాదు సంస్థాన విలీనానికి ముందు మరియు ఆ తరువాత, హైదరాబాదు సంస్థానంలోని సామాన్య ప్రజల పరిస్థితిని నిష్పక్ష పాతంగా చిత్రిస్తుంది. విలీనానికి ముందు రజాకార్ల దురాగతాలను, విలీనం తరువాత ఊరేగిన అరాచక పరిస్థితులను కూడా ఉన్నది ఉన్నట్టు చిత్రిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే '1948 కాలం నాటి 'పోలీసు చర్య' తాలూకు ప్రభావాన్ని ఈ కథ వివరిస్తుంది. ఎవ్వరు అధికారంలో ఉన్నా , పీడనకు గురయ్యేది సామాన్య ప్రజలేనన్న కఠినసత్యాన్ని ఈ కథ నిర్భయంగా, వ్యాఖ్యానిస్తుంది. ఎన్ని అల్లకల్లోలాలకు గురైనా, వెనుకంజ వేయని స్థిరమైన హిందూ- ముస్లిం ఐక్యతకు కూడా ఈ యుగాంతం కథ అక్షర నీరాజనం పడుతుంది.**

**కీలక పదాలు—నిజాం పాలన- హైదరాబాదు సంస్థానం- ఖాసిం రజ్వీ- రజాకార్లు- పోలీసు చర్య- దేశ విభజన- మతకలహాలు- భారతీయ సైనయం- పోలీసుచర్య- స్నేహాభిమానాలు- నెల్లూరి కేశవ స్వామి- యుగాంతం**

## I. వ్యాస ఉద్దేశ్యం

ఆనాటి పోలీసు చర్య గూర్చి చాలా అభిప్రాయభేదాలున్నాయి కొందరు దీన్ని హైదరాబదు సంస్థాన విమోచన దినంగా పరిగణిస్తే, ఇంకొందరు విలీన దినంగా అభివర్ణిస్తుంటారు. పోలీసు చర్య కాలంలో, అటు హిందూ, ఇటు ముస్లిం ప్రజల వాస్తవ జీవన విధానం ఏ విధంగా ఉండేదో, ఇరువర్గాల వారిలోనూ ఎంత అలజడి నిబిడీకృతంగా ఉండేదో, నిజాం పరిపాలన అంతమయ్యాక, హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనమయ్యాక, ఎలాంటి పరిస్థితులు తలెత్తాయో

'యుగాంతం' కథ ద్వారా పరిశీలించడమే, ఈ వ్యాస ఉద్దేశ్యం.

## II. పరిశోధనావిధానం

ఈ వ్యాస రచనకు విశ్లేషణాత్మక పరిశోధనావిధానం అవసరం అవుతుంది. సామాజిక, చారిత్రిక, మనోవైజ్ఞానిక కోణాలను కూడా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

"తెలుగు కథానిక సుసంపన్నమై భాసిస్తూ ఉన్నదంటే అందుకు ముఖ్యకారణం కొన్ని దశాబ్దాల పాటు ఆ ప్రక్రియపట్ల శ్రద్ధాసక్తులు కలిగి ఉండి, దానిని జీవితేశ్వరి వలె కొందరు రచయితలు ఆరాధించి ఎడతెగకుండా రచన చేస్తూ రావడమే. అట్టి వారిలో శ్రీ నెల్లూరి కేశవస్వామిగారు ఒకరు." అంటారు డి. రామలింగంగారు.

కథకు 'యుగాంతం' అని పేరు పెట్టడంలోనే రచయిత దృష్టికోణం మనకు అర్థం అవుతుంది. భారత దేశాన్ని వదిలి వెళుతూ, బ్రిటిష్ వారు, తమ ఆధీనంలో ఉన్న సుమారు 500 సంస్థానాధీశులకు ఒక ప్రత్యేకాధికా రాన్ని కట్టబెట్టారు. వారు భారతదేశం లో కానీ లేదా పాకిస్తానులో కానీ, వారి ఇష్టప్రకారంగా విలీనం కావచ్చు లేదా, ఎందులోనూ చేరకుండా, స్వతంత్రదేశంగా కూడా మనుగడ సాగించవచ్చు. మహాకవి దాశరథి అన్నట్టుగా "జన్మజన్మాల బూజు నిజాం రాజు" ఈ అవకాశం కోసరమే ఎదురురుచూస్తున్నాడు. గద్దెకు ఎక్కిన 1911 నుంచి కలలుకంటున్నాడు. ఒంటె పెదవులకోసం నక్కవలె ఎదిరి చూస్తున్నాడు. బ్రిటిషు ప్రభుత్వమూ- మహమ్మదలీ జిన్నా అందుకు ఆ 'ముసలినక్కను' ఉసికొల్పా రు." అంటూ దాశరథి రంగాచార్య గారు చక్కగా వివరిస్తారు.

ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న ఏడవ నిజాం ప్రభువు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ , తమ హైదరాబాదు సంస్థానాన్ని స్వతంత్రంగా ఉంచాలని, తాపత్రయ పడతాడు. అతడికి అండగా ఉంటానని వచ్చిన, ఖాసిం రజ్వీ నాయకత్వంలో, రజాకార్లు చెలరేగి పోతా రు. 12 జూన్, 1947 నాడు, నిజాం రాజు, ఫర్మానా జారీ చేసి, హైదరాబాదు సంస్థానానికి సర్వతంత్ర స్వతం త్రం ప్రకటించు కుంటూ, చార్మినార్ మీద తమ ఆసఫ్ జాహీ పతాకాన్ని ఎగురవేస్తాడు.

ఇక మరొక వైపు, ముస్లిమేతరులపై రజాకారుల దురా గతాలు అన్నీ, ఇన్నీ కావు. భారత ప్రభుత్వం ఎన్నో సామదాన మార్గాలను నిజాం ప్రభువు ముందుంచింది. కానీ నిజాం అవేవీ లెక్క చేయలేదు. "సామ్రాజ్యవాదులు సాధారణంగా అధికారం వదులుకోరు. అసలు అధికారమే అలాంటిది. దాన్ని ఎవడూ వదలదు. స్వచ్ఛందంగా అధికారం వదలుకున్న వారు చరిత్రలో అరుదు. అర్థం - అధికారం ఈ రెంటినీ వదిలించాలి తప్ప వదులుకోరు. ఈ సూత్రం చిన్న కుటుంబ యజమాని నుంచి సామ్రాజ్యవాదుల వరకు వర్తిస్తుంది" అని దాశరథి రంగాచార్య గారు చెప్పినట్టు, తన అధికారం కాపాడుకోవడానికి, ఎన్ని ప్రయత్నాలు చేయాలో , అన్ని ప్రయత్నాలూ, నిజాం రాజు చేసాడు. భారత ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల్ని తేలిగ్గా తీసుకొని, అవసరమైతే పాకిస్తానులో చేరి, భారత దేశం నడిబొడ్డు మీద దక్షిణ పాకిస్తానును ఏర్పరుస్తాను తప్ప, భారతదేశంలో చేరేదీ లేదని తెగేసి చెప్పాడు.

చివరకు విధిలేని పరిస్థితుల్లో ఆనాటి హోం మంత్రి సర్దార్ వల్లభ భాయ్ పటేల్ ఆధ్వర్యంలో హైదరాబాదు సంస్థానంపై 'ఆప రేషన్ పోలో' పేరిట భారత ప్రభు త్వం సైనిక జోక్యం చేసుకుంది. దీన్ని భారత ప్రభుత్వం

'పోలీసుచర్య' అని పిలిచింది. ఆరు నెలలు భారత ప్రభుత్వాన్ని నిలువరిస్తామన్న హైదరాబాదు సైన్యం మూడు రోజులకే లొంగిపోవడంతో, ,భారతీయ సైన్యం హైదరాబాదు నగరంలో ప్రవేశిస్తుంది. ఈ నేపథ్యంలో సరిగ్గా సెప్టెంబరు 15, 1948 నాటితో ఈ కథ మొదలౌతుంది.

## III. యుగాంతం కథాసారాంశం

హైదరాబాదు సంస్థానంపై పోలీసు చర్య మొదలైన నేపథ్యంలో, రజాకార్లుగా మారిన ఉద్యోగులు, అజ్ఞాతంలోకి వెళ్ళడం, హిందువులు కూడా, ఎప్పుడు ప్రమాదం ఏవైపునుండి వస్తుందో తెలియక బిక్కుబిక్కుమనడం, ఈ కథ జరగడానికి కీలకమైన అంశం.

రజాకారుగా మారిన దిలావర్, తనను వెతుకుతున్న భారతీయ సైన్యం నుండి తప్పించుకొనడానికి తన స్వంత ఊరు నల్గొండను వదిలి, హైదరాబాదుకు పారి వస్తాడు. ఒక అర్ధరాత్రి, తన స్నేహి తుడు స్వామిని వెదుక్కుంటూ వచ్చి, ఆశ్రయాన్ని పొందుతాడు.స్వామి వాళ్ళ అమ్మ కూడా దిలావర్ ను స్వంత కొడుకులాగా ఆదరిస్తుంది. ఆ తరువాత స్వామికి ఒక చిన్న మూట ఇచ్చి, దిలావర్ కరాచీకి, మారువేషంలో పారిపోతాడు. ఆ మూటలో ఉన్న డబ్బులూ, నగలన్నీ రజాకారుగా ఉన్నప్పుడు తన స్నేహితుడు దిలావర్ కొట్టుకువచ్చినవేనని తెలుసుకున్న స్వామి, వాటిని సివి ల్ టేంకు అప్పగించాలనుకుం టాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు, పరిపాలన మారినా, దోపిడీ మాత్రం ఆగలే దని తెలుసుకుంటాడు.

## IV. యుగాంతం కథలో కనబడే, సామాజిక అంశాలు

1)నిజాం రేడియో అవాస్తవ ప్రచారం:
నిజాం రేడియో ఒక వైపు భారతీయ సైన్యాలు,హైదరాబాదు సంస్థానంలోకి నలువైపుల నుండి చొచ్చుకొని వస్తున్నా, నిజాం ఆధీనంలోని దఖన్ రేడియో "రాత్రింబవళ్ళూ అసత్యపు వార్తలని ప్రచా రం చేసేది. భారతీయ ప్రభుత్వాన్ని తిట్టిపోస్తూ, అస్తమానం ఖాసిం రజ్వీని కీర్తించేది.

2)రజాకర్ల దుష్కృత్యాలు:
రజాకార్లు హిందువు లందరినీ ముస్లింలుగా మార్చాలని ప్రయత్నించేవారు. హైదరాబాదు పైకి నివురుగప్పిన నిప్పులాగా ప్రశాంతంగా ఉండేది. కానీ పల్లెల్లో ఎవరైనా ఎదురు తిరిగితే మాత్రం, హత్యలూ, దోపిడీలు, మానభంగాల్లాంటి అమానుష కృత్యాలు యథేచ్ఛగా కొనసాగేవి.

3)హిందువుల వలస:
పోలీసు చర్య నేపథ్యంలో, హైదరాబాదులో నివాముంటున్న హిందువుల్లో అవకాశమున్న చాలా మంది, నగరాన్ని వదిలి,తమ కుటుంబాలతో సహా, ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళారు.

4)ప్రజల మధ్య మతాతీతమైన ప్రేమాభిమానాలు:
రాజకీయంగా ఎలా ఉన్నా, ప్రజల మధ్య ప్రేమానురాగాలు ఎప్పటిలాగానే ఉండేవి. దిలావర్ స్వామి దగ్గర మాత్రమే, తాను సురక్షితంగా ఉంటానని భావించి రావడమే ఇందుకు నిదర్శనం.
'దిలావర్ దృష్టి అమ్మ మీద పడగానే "అమ్మా! నేను దిల్లూను. నాకు ఆకలిగా

ఉండమ్మా!”అన్నాడు దీనంగా’ అమ్మ కళ్ళు మెరిశాయి. కరుణతో నిండిపోయాయి’ అన్న వాక్యాలు ఇందుకు మంచి ఉదాహరణ.

5)రజాకారుల అకృత్యాల పట్ల నిజాం సర్కారు నిర్లక్ష్యధోరణి:

ప్రభుత్వ ఉద్యోగుల్లో చాలామంది రజాకార్లుగా మారేవారు. అయినా నిజాం ప్రభుత్వం ఏమీ పట్టించుకునేది కాదు. డిప్టీకలెక్టరుగా ఉన్నతోద్యోగంలో ఉన్న ఇక్బాల్, తన నాయకత్వం లో అనేక గ్రామాల్ని కొల్లగొట్టించే వాడు. అక్కడితో ఆగక, ఒక సారి, ఏకంగా ఇరవైమంది యువకులను కాల్చి చంపిన దుర్మార్గమైన సంఘటనే దీనికి నిదర్శనం. ఇంత ఘోరం జరుగుతున్నా, నిజాం సర్కారు ఏమీ పట్టించుకోకపోయేది.

6)నిజాం స్వార్ధ బుద్ధి:

నిజాం ఖాసిం రజ్వీని కూడా తన అవకాశవాదం కోసం మాత్రమే వాడుకున్నాడు. భారతీయసైన్యం హైదరాబాదులోకి, ప్రవేశిస్తున్నదన్న సత్యం తెలియగానే, తన స్వలాభాల కోసం లొంగిపోయి, ప్రజలను శాంతంగా ఉండాలని పిలుపునిచ్చాడు. అంతేకాకుండా అల్లర్లు రేపిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరికలు జారీయ్యాయి.

“పచ్చి అబద్ధం! రేపు నిజంగానే హైదరాబాదు రాష్ట్రానికి స్వతంత్రం వచ్చి ఉంటే, ఒరిగేదెవరికి? వాడు గద్దె దిగి పోయే వాడా, ఖాసిం రజ్వీకి పట్టం కట్టేవాడా?” అన్న దిలావర్ ప్రశ్నారూపక ఆవేదనా వాక్యాలు, దీనికి సాక్ష్యాలుగా మనల్ని ఆలోచింపజేస్తాయి.

7)అంతరించిన రజాకార్ల దుర్మార్గాలు:

రెండు వందల ఏళ్ళు హైదరాబాదును పాలించిన అసఫ్ జాహీల నియంతృత్వ పరిపాలన ముగిసి, హైదరాబాదు భారత యూనియన్లో విలీనమైంది. అంతేకాకుండా రజాకారుల దుర్మార్గాలు కూడా అంతమయ్యాయి. దీన్ని రచయిత ఒక యుగం అంతం కావడంతో పోల్చాడు.

8)రజాకారుల కోసం భారతీయసైన్యం వేట:

హైదరాబాదు రాజ్యంలో ప్రవేశించిన భారతీయ సై న్యం కూడా, రజాకర్ల అణచివేత పేరిట అకృత్యాలను సాగించింది. రజాకార్లను వేటాడింది. చివరికి ముస్లింల సంప్రదాయ వస్త్రధారణలో ,రోడ్ల మీద యువకులు తిరుగలేని పరిస్థితి వచ్చింది.

ఖద్దరు లాల్చీ, ధోతీ ధరించి, మారు వేషాల్లో పారిపోతున్న యువకులను ధోతీలు ఊడబెరికి, వారు ముస్లింలే అని తేలితే దారుణంగా హింసించేవారు. . దిలావర్ తన మీసాలూ, గడ్డమూ గీక్కొని, స్వామి ఇచ్చిన ప్యాంటు,షర్టులో మారువేషం లో బయటకు పోవడమే పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ఇక హైదరాబాదులో, తిరిగి తాను స్వేచ్ఛాయుత జీవితం గడప లేనన్న నిశ్చయానికి వచ్చి మాత్రమే,, దిలావర్ కరాచికీ పారిపోయాడు.

9)ప్రజల ఆకాంక్ష:

నిజాం పాలన ముగిసి, భారత దేశంలో హైదరాబాదు సంస్థానం విలీనం కావడంతో, హైదరాబాదులో ప్రవేశిస్తున్న సైన్యానికి ప్రజలు రహదారికి రెండువైపులా నిలబడి, జాతీయ జెండాలను రెపరెపలాడిస్తూ, ఘనస్వాగతం పలికారు. ఇది తాము భారతదేశంలో కలియాలన్న ఆనాటి ప్రజల ఆకాంక్షను, నిజాం

దుర్భరమైన పరిపాలననుండి విముక్తి పొందాక, పొంగిపొరలిన ఉత్తేజాన్ని, ఉత్సా హాన్ని తెలుపుతుంది.

10)మారిన పాలన- ఆగని దోపిడీ :
రజాకార్లు కొల్లగొట్టి, దాచిన సొమ్మును, భారతీయ సైన్యంలోని కొందరు కొల్లగొట్టేవారు. భారతీయ సైన్యంతో పాటు వచ్చిన సివిల్ టీంలోని తహసీల్దారులు కూడా, అందినంతలో కొత్త దోపిడీకి తెరలేపారు. వీరిని రచయితా 'కిష్కిన్దాపుర నివాసులు' అని హాస్య ధోరణిలో పేర్కొన్నాడు. రావణసంహారం తరువాత, లంకానగరాన్ని, వానరులు కొల్లగొట్టినట్టు, వీరి ప్రవర్తనఉంటుందని రచయిత ఇటువంటి అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. .పరిపాలన ఎవరిదైనా, సామాన్య ప్రజలే ఎప్పుడూ పీడనకూ, దోపిడీకీ గురయ్యారన్న చేదు నిజం ఈ కథలో చిత్రించబడింది.

## V. ముగింపు

'యుగాంతం' కథ ద్వారా మనకు ప్రధానం గా ఈ విషయాలు తెలుస్తున్నాయి.

1) అధికారంలో ఉన్నవారు తమ స్వార్థం కోసం, రాజభోగాలు కాపాడుకోవడం కోసం ఎంతకైనా దిగజారుతారు. భారతసైన్యం హైదరాబాదును చేరవచ్చిన నేపథ్యంలో, నిజాం నవాబు తాను లొంగిపోయి, ఇంతవరకూ తన కోసం పోరాడిన రజాకారులను కూడా లొంగిపొమ్మనడం స్వార్థానికి పరాకాష్ఠ!
2) స్నేహానుబంధాల ముందు ఎలాంటి కుల, మత, ప్రాంత రాజకీయాలు పనిజేయవన్న సత్యం ఈ కథ ద్వారా తెలు స్తున్నది.
3) హైదరాబాదు సంస్థాన విలీన సందర్భంలో హిందూ- ముస్లింల అంతస్సంఘర్షణను ఈ కథ చిత్రించింది.
4) 'పాలకులతో నిమిత్తం లేకుండా, దోపిడీకి గురయ్యేది సామాన్య ప్రజలే' అన్న సత్యాన్ని ఈ కథ చాటిచెప్పుతుంది.
5) ఎలాంటి పక్షపాతాలు, మొహమాటాలు లేకుండా 'యుగాంతం' చారిత్రిక వాస్తవాన్ని, నిర్భయంగా యథాతథంగా చి త్రించిన చారిత్రాత్మక కల్పనాకథ. మనకు రజాకార్లు హిందువులను పెట్టిన బాధలే తెలుసు. కానీ ముస్లిం యువకులు కూడా, ఎన్ని బాధలు పడ్డారో, ఈ కథ రికార్డు చేసింది.
6) గూడూరి సీతారాం గారు పేర్కొన్నట్టు, ఇంకే కథలు రాయక పోయినా, ఒక్క యుగాంతం కథ ద్వారానే, కేశవస్వామి గారు తెలుగు కథకులలో శాశ్వత స్థానం సంపాదించుకునేవారు. . గోల్కొండ ప్రాంతంలో దొరికిన కోహినూరు వజ్రంలాంటిది ఈ కథ!

## ఉపయుక్త గ్రంథ సూచి:

[1] నెల్లూరి కేశవస్వామి. (1981). చార్మినార్ కథలు. హైదరాబాద్.
[2] దాశరథి రంగాచార్య. (2008). జీవనయానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
[3] దాశరథి కృష్ణమాచార్యులు. (2006). అగ్నిధార. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
[4] సురవరం ప్రతాపరెడ్డి. (1992). ఆంధ్రుల సామాజిక చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
[5] పుచ్చలపల్లి సుందరయ్య. (1972). తెలంగాణ ప్రజల సాయుధ పోరాటం – గుణపాఠాలు. హైదరాబాద్: ప్రజాశక్తి బుక్ హౌస్.
[6] తెలంగాణ తెలుగు అకాడమీ. (2010). హైదరాబాదు సంస్థాన చరిత్ర. హైదరాబాద్: తెలుగు అకాడమీ.

[7] వకుళాభరణం రామకృష్ణ. (2014). తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఉద్యమాలు. హైదరాబాద్: ఎమెస్కో పబ్లికేషన్స్.
[8] కె. జయశంకర్. (2008). తెలంగాణ రాష్ట్రం – ఒక డిమాండ్. హైదరాబాద్.
[9] ఎం. సత్యనారాయణ రావు. (2005). హైదరాబాదు సంస్థానం – రాజకీయ, సామాజిక పరిణామాలు. హైదరాబాద్.
[10] బి.ఎన్. శాస్త్రి. (1992). తెలంగాణ చరిత్ర – సంస్కృతి. హైదరాబాద్.
[11] భారత ప్రభుత్వం. (1948). హైదరాబాదు సంస్థానంపై పోలీసు చర్య (ఆపరేషన్ పోలో) – శ్వేతపత్రం. న్యూఢిల్లీ: భారత ప్రభుత్వ ప్రచురణ.
[12] సర్దార్ వల్లభభాయ్ పటేల్. పటేల్ లేఖలు మరియు ప్రసంగాలు. న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్.
[13] రామలింగం, డి. (1981). చార్మినార్ కథలు – ముందుమాట. హైదరాబాద్.
[14] గూడూరి సీతారాం. (1985). తెలుగు కథ – పరిణామం మరియు విశ్లేషణ. హైదరాబాద్.
[15] తెలంగాణ సాహిత్య అకాడమీ. (2018). తెలంగాణ కథా సాహిత్యం – చరిత్ర మరియు పరిణామం. హైదరాబాద్